# బండి సంజయ్ పెద్ద దొంగ



బావుపేటలో మంత్రి గంగులకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

- గుండెపోటు డ్రామాతో ఎంపీగా గెలిచిండు
- టికెట్లు అమ్ముకుని రూ.కోట్లు సంపాదించిండు
- అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి
- కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

కొత్తపల్లి, నవంబర్ 25 : సమైక్యపాలనలో 40 ఏళ్ల పాటు దరిద్రాన్ని అనుభవించామని, పదేళ్ల తెలంగాణ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు మరోసారి పట్టంకట్టాలని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం కొత్తపల్లి మండలంలోని బావుపేటలో ఆయన ఎన్నికల ప్రచారం చేయగా, ప్రజలు పూలమాలలు, మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్, బీజేపీలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అభివృద్ధి చెందిన తెలంగాణను చూసి సమైక్యపాలకుల కడుపులు మండుతున్నాయని, ఎన్నికల పేరుతో రాష్ట్రాన్ని దోచుకొనే కుట్రలకు తెరలేపారని మండిపడ్డారు. కరీంనగర్ బీజేపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న బండి సంజయ్ పెద్ద దొంగ అని, గుండెపోటు డ్రామాలాడి ఎంపీ ఎన్నికల్లో గెలుపొంది రూ.వందల కోట్లు అక్రమంగా కూడబెట్టాడని చెప్పారు. నాలుగున్నరేళ్లలో ఎన్నడూ కనిపించని ఆయనకు ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజలు గుర్తుకు వచ్చారని, కరీంనగర్ ఎంపీగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండి కూడా అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని ధ్వజమెత్తారు. ఆయన కంటే తానే పెద్ద హిందువునని, టీటీడీ, ఇస్కాన్ దేవాలయాలను కరీంనగర్‌లో నిర్మిస్తున్నానని, బండి సంజయ్ ఒక్కటైనా కట్టాడా? అని ప్రశ్నించారు. రాష్ట్ర అధ్యక్ష పదవి ఇస్తే టికెట్‌ల దుకాణం పెట్టి కోట్ల రూపాయలు సంపాదించాడని విమర్శించారు. డబ్బులు ఇవ్వలేదని కారణంతోనే బీసీ బిడ్డ తుల ఉమకు టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేశాడన్నారు. టిక్కెట్ల కేటాయింపులో అవినీతికి పాల్పడ్డాడనే కారణంతోనే ఆయనను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించారని తెలిపారు. కూడబెట్టిన అవినీతి సొమ్ముతో ఒక్కో ఓటుకు రూ.20 వేలు, సెల్‌ఫోన్ ఇస్తున్నాడనే ప్రచారం జరుగుతున్నదని చెప్పారు. కాంగ్రెస్‌లో రేవంత్‌రెడ్డి టికెట్లు అమ్ముకుంటున్నాడని, అందుకనే కరీంనగర్ టిక్కెట్‌ను భూకబ్జాలు చేసిన, 32 కేసులున్న రౌడీ షీటర్‌కు కేటాయించారని తెలిపారు. కరీంనగర్ అసెంబ్లీ పరిధిలో తాను చేసిన అభివృద్ధి, తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు.

### బావుపేట నా సొంతూరు లెక్క

తెలంగాణ రాకముందు కరీంనగర్ టూ వేములవాడ రోడ్ ఎలా ఉండేదని, ఇప్పుడెలా ఉందో ప్రజలు గమనించాలని కోరారు. బావుపేట అంటే తన సొంతూరులాంటిదని, గత ఎన్నికల్లో ఈ గ్రామం నుంచి 490 ఓట్ల మెజార్టీని అందించారని కృతజ్ఞతలు తెలిపారు. ఎండిపోయిన చెరువులకు వరదకాలువ నుంచి నీటిని తెచ్చి పూర్వవైభవం తీసుకు వచ్చానని చెప్పారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరించారు. అంతకు ముందు కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు ఆధ్వర్యంలో చింతకుంట వద్ద వందలాది బైకులతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి శ్రీలతామహేశ్, జడ్పీటీసీ పిట్టల కరుణ, సర్పంచ్ కడారి శాంత శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్, ఎంపీటీసీ దావ కమల మనోహర్ పాల్గొన్నారు.



బావుపేటలో గంగుల ఎన్నికల ప్రచారానికి భారీగా తరలివచ్చిన గ్రామస్తులు



ఈదులగట్టెపల్లిలో పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న రసమయి, జీవీఆర్

# కాంగ్రెస్‌కు ఓటేస్తే తెలంగాణ ఆగమైతది

- బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటేనే అభివృద్ధి కొనసాగుతది
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్
- కాంగ్రెస్ హామీలకు గ్యారెంటీ లేదు
- బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్
- మానకొండూర్ మండలంలో విస్తృత ప్రచారం

మానకొండూర్ రూరల్, నవంబర్ 25: కాంగ్రెస్‌కు ఓటేస్తే తెలంగాణ ఆగమైతదని, అలాగే రాష్ట్రం అంధకారమై ప్రతి ఒక్కరూ టార్చిలైట్ కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్‌ను తిరిగి గెలిపించుకుంటేనే అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతుందని పేర్కొన్నారు. శనివారం మానకొండూర్ మండలంలోని లక్ష్మీపూర్, వేగురుపల్లి, ఊటూర్, ఈదుల గట్టెపల్లి, గంగిపల్లి, కొండపల్కల గ్రామాల్లో మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఊటూర్‌లో జరిగిన ప్రచారంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోరాడి సాధించుకున్న తెలంగాణను కాంగ్రెస్ చేతిలో పెడితే కుక్కలు చింపిన విస్తరైతదని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు ఊర్లలో దుష్ప్రచారం చేస్తున్నారని, వాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారుగుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో రసమయి బాలకిషన్‌ను గెలిపిస్తేనే, అక్కడ కేసీఆర్ సీఎం అవుతాడని పేర్కొన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, కాంగ్రెస్ హామీలకు గ్యారెంటీ లేదు.. కవ్వంపల్లి మాటలకు వారంటీ లేదని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీల పేరుతో దొంగ మాటలు చెబుతూ ఊర్లలోకి వస్తున్న వారిని నమ్మద్దని ప్రజలకు సూచించారు. 10 ఏండ్లలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఎన్నికలు కాగానే ప్రతి దళిత కుటుంబానికీ రూ. 10 లక్షల సాయం అందిస్తామని పునరుద్ఘాటించారు. జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే రసమయి బాలకిషన్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. కాగా, ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్‌లో చేరిన వారికి ఎమ్మెల్యే, జీవీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సుడా చైర్మన్ జీవీఆర్‌తో పాటు వినోద్‌కుమార్‌కు డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గడ్డం నాగరాజు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, సొసైటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పార్టీ గ్రామాధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# నా జీవితం ప్రజా సేవకే అంకితం



గంద్రపల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

- మీ మధ్యనే ఉంటా.. సేవకుడిలా పనిచేస్తా
- నాకో అవకాశం ఇచ్చి చూడండి.. రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేస్తా
- బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి
- జమ్మికుంట మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం

జమ్మికుంట, నవంబర్ 25: 'ప్రజలను పట్టించుకోని.. సమస్యలు పరిష్కరించని వ్యక్తికి ఏడు సార్లు అవకాశం ఇచ్చారు. నాకో అవకాశం ఇచ్చి చూడండి. నియోజకవర్గాన్ని రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేస్తా. రాష్ట్రంలోనే నంబర్‌వన్ నియోజకవర్గంగా హుజూరాబాద్‌ను తీర్చిదిద్దుతా. నా జీవితం ప్రజా సేవకే అంకితం. మీ మధ్యనే ఉంటా.. సేవకుడిలా పనిచేస్తా. బీఆర్ఎస్‌ను ఏ శక్తి అడ్డుకోలేదు. పక్కాగా.. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆరే. ఇక్కడ వేరే వ్యక్తి గెలిస్తే మనకేం లాభం..? ఆలోచించాలే. కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే.. ఆగమైపోతం. అరిగోసపడ్తం..'అని బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని గంద్రపల్లి, వెంకటేశ్వర్లపల్లి, కోరపల్లి గ్రామాల్లో ఆయన ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డికి, బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది. అడుగడుగునా జై తెలంగాణ.. జై కేసీఆర్.. జై కౌశికన్న.. అంటూ నినాదాలు చేశారు. ముఖ్యంగా మహిళలు మంగళహారతులు పట్టారు. బొట్టు పెట్టి ఆశీర్వదించారు. అనంతరం ప్రచార కార్యక్రమాల్లో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. గడిచిన రెండేళ్లుగా మీతోనే ఉంటున్నానని, ప్రజా సమస్యలను తన సమస్యలుగా పరిష్కరిస్తున్నానని చెప్పారు. ఈటల రాజేందర్ గెలిచిన తర్వాత పైసా పని కూడా చేయాలని, ఉప ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు ఏమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. మళ్లీ ఇక్కడ గెలిచి ఏం చేయడని తెలిపారు. కన్నతల్లిలాంటి పార్టీని, రాజకీయ గురువు కేసీఆర్‌కే వెన్నుపోటు పొడిచిన వ్యక్తి, ఇప్పుడు నియోజకవర్గ ప్రజలను కూడా మోసం చేసేందుకు సిద్ధమయ్యాడని ఆరోపించారు. గజ్వేల్‌కు వెళ్లిపోతున్నానని చెబుతున్న విషయాలను వివరించారు. రాష్ట్రంలో బీజేపీ వచ్చేదే లేదని, ఆ పార్టీకి ఓటేస్తే నష్టపోతామన్నారు. ఇక కాంగ్రెస్ యాభై ఏళ్లు పాలించి తెలంగాణ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలన్నారు. ఆ పార్టీని నమ్మితే 24గంటల కరెంటు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు కనిపించకుండా పోయే రోజులు వస్తాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సమగ్రాభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని, హుజూరాబాద్‌లో గులాబీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే తనను దీవించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో కౌశిక్‌రెడ్డి వెంట ఆయన సతీమణి శాలినీరెడ్డి, డీసీసీబీ పింగిళి రమేశ్, గంద్రపల్లి, వెంకటేశ్వర్లపల్లి, కోరపల్లి సర్పంచులు బల్గూరి పద్మ-సమ్మారావు, బోయిని రాజ్‌కుమార్, గిరవేన రమ, ఎంపీటీసీ తోట కవిత-లక్ష్మణ్, పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# నేడు మంత్రి కేటీఆర్ పర్యటన

- సభ ఏర్పాట్లను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చొప్పదండి, నవంబర్ 25: చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవి శంకర్‌కు మద్దతుగా ఆదివారం పట్టణంలో మంత్రి కేటీఆర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. ఈ మేరకు చొప్పదండి వ్యవసాయ మార్కెట్ రోడ్డులో సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు మంత్రి కేటీఆర్ చొప్పదండికి వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సభా స్థలాన్ని పరిశీలించిన వారిలో సీఐ రవీందర్, ఎస్ఐ ఉపేంద్రాచారి, ఎంపీపీ చిలక రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, కౌన్సిలర్లు కొత్తూరి మహేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గొల్లపల్లి శ్రావణ్‌కుమార్, మహేశుని మల్లేశం, మావూరం మహేశ్, రవితేజ, ఎన్నం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.